పార్కింగ్‌ల జోరు.. ప్రజల బేజారు

- పద్మవ్యూహాన్ని తలపిస్తున్న గాజువాక ప్రధాన రహదారి
- వాహన చోదకులు, పాదచారులు ఇక్కట్లు
- అటకెక్కిన సెల్లార్ పార్కింగ్



మెయిన్ రోడ్డులో పార్కింగ్ తీరు ఇలా..



ఫుట్‌పాత్‌ల ఆక్రమణతో రోడ్లపై నడుస్తున్న జనం



సాయంత్రం వేళల్లో గాజువాక మెయిన్‌రోడ్డులో ట్రాఫిక్ కష్టాలు

గాజువాక: ఒక పక్క ద్విచక్ర వాహనాలు, కార్ల పార్కింగులు.. మరో పక్క తోపుడు బళ్లు, ఇంకో పక్క పార్కింగ్ సౌకర్యం లేని వాణిజ్య సముదాయాలు, హోటళ్లు, షాపింగ్ మాళ్లు.. ఇదంతా ఒక ఎత్తయితే ఆటోల హల్‌చల్ మరో ఎత్తు. గాజువాక ప్రధాన రహదారి (మెయిన్ రోడ్)లో నిత్యం ఎదురయ్యే పరిస్థితి ఇది. సాధారణ రోజుల్లోనే పరిస్థితి ఇలా ఉంటే, పండగల సమయంలో ఎలా ఉంటుందో చెప్పక్కర్లేదు. రహదారి మొత్తం పద్మవ్యూహాన్ని తలపిస్తుంది. రోడ్డుపై వెళ్లాలంటే పట్టపగలే చుక్కలు కనిపిస్తాయి. పాతగాజువాక నుంచి కొత్త గాజువాక వరకు గల కిలోమీటరు దూరం ప్రయాణించాలంటే ట్రాఫిక్ చక్రబంధంలో చిక్కుకోక తప్పని పరిస్థితి ఉంది.

అస్తవ్యస్త పార్కింగ్‌తో అవస్థలు..

అస్తవ్యస్త పార్కింగ్‌ల వల్ల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. ఉదయం, సాయంత్రం సమయాల్లో రోడ్డుపై నడిచి వెళ్లేందుకు కూడా ఇబ్బంది పడాల్సి వస్తోంది. ఒక్క గాజువాక మెయిన్ రోడ్డులోనే రాంగ్ పార్కింగ్‌కు సంబంధించి గాజువాక ట్రాఫిక్ పోలీసులు సగటున రోజుకు 80 కేసులు నమోదు చేస్తున్నట్టు చెబుతున్నారు. దీన్నిబట్టి పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఒకపక్క ఫుట్‌పాత్‌ల ఆక్రమణలు, మరోపక్క రోడ్డుపై అడ్డూ అదుపూ లేని పార్కింగ్‌ల వల్ల ఈ సమస్య జటిలమవుతోంది. ఉదయం పూట, సాయంత్రం ఐదు గంటల తర్వాత రోడ్డుపై నడిచి వెళ్లేందుకు కూడా ఇబ్బంది పడాల్సి వస్తోంది. వాహనాలు, పాదచారులు రాకపోకలు సాగించాలంటే ముప్పుతిప్పలు పడాల్సి వస్తోంది.

సెల్లార్ పార్కింగ్‌లను మర్చిపోయినట్టే..

సెల్లార్లను ఉపయోగిస్తే ఈ సమస్యకు పరిష్కారం లభిస్తుందని గతంలో జీవీఎంసీ అధికారులు భావించి పలు సెల్లార్లలో ఆక్రమణలను తొలగించిన విషయం తెలిసిందే. గాజువాక మెయిన్ రోడ్డులోని 24 సెల్లార్లలో ఆక్రమణలను గుర్తించారు. రాజకీయ ఒత్తిళ్లు వచ్చినప్పటికీ అధికారులు 10 సెల్లార్లలో ఆక్రమణలను ఖాళీ చేయించారు. అయితే ఆ తర్వాత వాటిని పట్టించుకోకపోవడంతో భవన యజమానులు సెల్లార్లను యుధాతథంగా ఆక్రమించేశారు. దీంతో వాహన చోదకులు తమ వాహనాలను రోడ్లపైనే నిలుపుతున్నారు. సెల్లార్ పార్కింగ్ సౌకర్యం ఉన్నచోట రోడ్లపై నిలిపితే చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత ట్రాఫిక్ పోలీసులదేనని జీవీఎంసీ అధికారులు చేతులు దులుపేసుకోవడం, పోలీసులు కూడా ఆ దిశగా చర్యలు తీసుకోకపోవడంతో గత అధికారులు చేసిన ప్రయత్నాలు కనుమరుగైపోయాయి.

పెయిడ్ పార్కింగ్ ప్రతిపాదన బుట్టదాఖలు..

గాజువాక పట్టణంలో ప్రధాన రహదారిపై వాహనాల పార్కింగ్‌ను నిరోధించడానికి పెయిడ్ పార్కింగ్‌లు ఏర్పాటు చేయాలని గతంలో జీవీఎంసీ అధికారులు ప్రతిపాదనలు రూపొందించారు. గాజువాక మెయిన్ రోడ్డులో నాలుగు చోట్ల పార్కింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని అధికారులు భావించారు. దీనిపై సర్వే పూర్తి చేసి నివేదికలు కూడా తయారు చేశారు. ఆ తర్వాత అధికారులు మారిపోవడం, కొత్తగా వచ్చిన ప్రజాప్రతినిధులకు ఆ విషయం తెలియకపోవడంతో అప్పటి నివేదికలు, ప్రతిపాదనలు అటకెక్కాయి.

ఆక్రమణలతో కుదించుకుపోతున్న రోడ్డు..

మాస్టర్ ప్లాన్ ప్రకారం గాజువాక మెయిన్ రోడ్డు 240 అడుగుల వెడల్పుతో ఉండాలి. అయితే రహదారికి ఇరువైపులా భారీ వాణిజ్య సముదాయాలు, హోటళ్లు, షాపింగు మాళ్లు పెరగడంతో అధికారులు రోడ్డును విస్తరించాలన్న ఆలోచనే చేయలేని పరిస్థితి ఉంది. ఉన్న రహదారిపై కూడా దుకాణాలకు వచ్చే కొనుగోలుదారులు ద్విచక్రవాహనాలు, కార్లను పార్కింగ్ చేస్తుండటంతో మరింత చిన్నదైపోయింది. వీటికి తోపుడు బళ్లు అదనం. తోపుడు బళ్ల కోసం ప్రత్యేకంగా హాకర్ జోన్లు ఏర్పాటు చేసి వారిని అక్కడికి తరలించాలని గతంలో అధికారులు ప్రయత్నాలు చేశారు. వివిధ కారణాలతో ఆ ప్రతిపాదన అటకెక్కింది. జోన్ ఏర్పాటులో గందరగోళ పరిస్థితిని అధిగమించలేక అధికారులు చేతులెత్తేశారు. ఈ కారణంగా మెయిన్ రోడ్డు రెండు పక్కలా సుమారు 20 అడుగుల వరకు కుదించుకుపోతోంది.

నేటి నుంచి ఎస్జీఎఫ్ క్రీడా పోటీలు

అగనంపూడి : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్జీఎఫ్) పరవాడ మండల స్థాయి క్రీడా పోటీలు గురువారం మధ్యాహ్నం నుంచి ప్రారంభం కానున్నాయని లంకెలపాలెం స్కూల్ హెచ్‌ఎం రౌతు నాగేశ్వరరావు తెలిపారు. ఈ నెల 16 నుంచి 18 వరకు మూడు రోజులపాటు పోటీలు జరుగుతాయని ఆయన తెలిపారు. గురువారం ఉదయం ఎఫ్ఎ – 2 బయాలజీ పరీక్షలు అనంతరం మధ్యాహ్నం ఒంటి గంటకు లంకెలపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అండర్ – 14, 17 (బాలురు, బాలికలు) పోటీలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. 17న ఫార్మాసిటీ నిర్వాసితకాలనీ లేమర్తి ఉన్నత పాఠశాల ఆవరణలో ఖోఖో, కబడ్డీ పోటీలు, 18న పరవాడ ఇండోర్ స్టేడియంలో షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు, ముత్యాలమ్మపాలెం హైస్కూల్ ఆవరణలో వాలీబాల్, చెస్, యోగా పోటీలు నిర్వహిస్తామని ఆయన తెలిపారు. మండలంలోని 11 ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు విద్యార్థులను వ్యాయామ ఉపాధ్యాయులతో క్రీడా పోటీలకు పంపించాలని ఆయన కోరారు.

అవినీతిరహిత సమాజం నిర్మిద్దాం



మాట్లాడుతున్న హెచ్‌పీసీఎల్ డీజీఎం శ్రీనివాసులు

గాజువాక : అవినీతిరహిత సమాజ నిర్మాణంలో విద్యార్థులు భాగస్వాములు కావాలని హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ డిప్యూటీ జనరల్ మేనేజర్ కె.శ్రీనివాసులు సూచించారు. స్థానిక ఎంవీఆర్ డిగ్రీ కళాశాలలో బుధవారం నిర్వహించిన నిఘా వారోత్సవాల కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రపంచంలో భారత్ అవినీతిలో 96వ స్థానంలో ఉందన్నారు. భవిష్యత్‌లో అవినీతి లేకుండా విద్యార్థులు విలువలు పాటించాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌పీసీఎల్ హెచ్ఆర్ మేనేజర్ నర్సింహం, కళాశాల ప్రిన్సిపాల్ ఎ.బాలకృష్ణ, అధ్యాపక ప్రతినిధులు ఎస్.వి.కృష్ణ, బి.తేజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఘనంగా ధమ్మచక్ర పరివర్తన దినోత్సవం



ప్రసంగిస్తున్న మాటూరి శ్రీనివాసరావు

ఉక్కునగరం : స్టీల్‌ప్లాంట్ బౌద్ధ విహార్‌లో ధమ్మచక్ర పరివర్తన దినోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. స్టీల్‌ప్లాంట్ బౌద్ధ మిషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ధమ్మ ఉపాసక మాటూరి శ్రీనివాసరావు ముఖ్య వక్తగా ప్రసంగించారు. డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ 1956 అక్టోబర్ 15న నాగపూర్‌లో ధర్మదీక్ష తీసుకున్నారన్నారు. ఈ దీక్ష ద్వారా దేశ ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చి బౌద్ధ ధర్మ ప్రయాణ మార్గం చూపించారన్నారు. డాక్టర్ మాటూరి రత్నకుమారి, ఆర్.టి.ఆర్.అంబేడ్కర్, మంత్రి అప్పలరాజు, వై.ఎస్.మూర్తి, అంబటి సర్వేశ్వరరావు, బచ్చల శ్రీనివాసరావు, బయ్యేలి శ్రీనివాస్, మూర్తి, పరమట ప్రసాద్ పాల్గొన్నారు.

ఘనంగా చేతుల పరిశుభ్రత దినోత్సవం



చేతులు శుభ్రం చేసుకుంటున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

కూర్మన్నపాలెం : ప్రపంచ చేతుల పరిశుభ్రత దినోత్సవాన్ని బుధవారం కణితి ఉన్నత పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ శుభ్రత పాటించాల్సిన అవసరముందన్నారు. లేకుంటే అనేక వ్యాధులు ప్రబలే ప్రమాదముందన్నారు. ఈ విషయాన్ని విద్యార్థులు గమనించి చేతులు శుభ్రం చేసుకోవాలని సూచించారు. ప్రధానోపాధ్యాయుడు నర్సింగరావు, సురేంద్రకుమార్, నాగమణి పాల్గొన్నారు.

నిరుపేదలకు అన్నదానం



అన్నదానం చేస్తున్న సమితి ప్రతినిధులు

అగనంపూడి: జీవీఎంసీ 79వ వార్డు అగనంపూడి సత్రం కూడలిలోని మహాత్మాగాంధీ సేవా సంఘం కార్యాలయ ఆవరణలో బొర్రమాంబ పారాయణ సేవా సమితి ఆధ్వర్యంలో నిరుపేదలు, అనాథలకు అన్నదానం చేశారు. వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి బలిరెడ్డి నాగేశ్వరరావు, పద్మావతి దంపతులు పుత్రిక భవ్యశ్రీ జన్మదినం సందర్భంగా ఆహార పొట్లాలు అందించారు. కార్యక్రమంలో బలిరెడ్డి నాగేశ్వరరావు, పద్మావతి దంపతులు, బొర్రమాంబ పారాయణ సేవా సమితి ప్రతినిధులు చిత్తా పద్మ, శోభారాణి, చిత్తా రామారావు, కల్లేపల్లి బాలమురళి తదితరులు పాల్గొన్నారు.

ప్రేమ పేరుతో మోసం

పెదగంట్యాడ : గంగవరం గ్రామానికి చెందిన కోన లోకేష్ అనే యువకుడు అదే ప్రాంతానికి చెందిన ఓ వివాహితను ప్రేమ పేరుతో లోబర్చుకున్నాడు. శారీరక సంబంధం పెట్టుకున్నాడు. అపై ఆమెను గర్భవతిని చేశాడు. అయితే అప్పటికే ఆ యువతికి వివాహం కావడంతో పెద్దల సమక్షంలో ఆమె భర్తకు విడాకులు ఇప్పించాడు. ఆపై పెళ్లి చేసుకోవాలని ఆమె కోరడంతో ముఖం చాటేశాడు. దీంతో ఆమె తాను మోసపోయానని గుర్తించి న్యూపోర్టు పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన పోలీసులు లోకేష్‌ను అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు.

రైల్వేస్టేషన్‌లో 5 కిలోల గంజాయి స్వాధీనం

తాటిచెట్లపాలెం: విశాఖ రైల్వే స్టేషన్‌లో బుధవారం నిర్వహించిన తనిఖీల్లో 5 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని, రవాణాదారుడిని అదుపులోకి తీసుకున్నారు. గవర్నమెంట్ రైల్వే పోలీసులు తెలిపిన వివరాలిలా.. జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ధనుంజయనాయుడు ఆధ్వర్యంలో ఆర్పీఎఫ్, జీఆర్పీ, సీఐబీ సంయుక్తంగా తమ సిబ్బందితో కలిసి రైల్వే స్టేషన్‌లోని పలు ప్లాట్‌ఫారాల్లో తనిఖీలు నిర్వహించారు. ఒడిశా కోరాపుట్ జిల్లాకు చెందిన దేవేందర్ భోస్లా కోరాపుట్ నుంచి విశాఖకు అక్రమంగా గంజాయి తీసుకురావడాన్ని గుర్తించి అరెస్ట్ చేశారు. రూ.25 వేల విలువైన 5 కేజీల గంజాయి స్వాధీనం చేసుకుని, నిందితుడిని కోర్టులో హాజరు పరిచారు.

స్టీల్‌ప్లాంట్ ఏర్పాటులో అమృతరావు కృషి మరువలేనిది



అమృతరావు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

ఉక్కునగరం : విశాఖ స్టీల్‌ప్లాంట్ ఏర్పాటులో టి.అమృతరావు కృషి శ్లాఘనీయమని పలువురు వక్తలు కొనియాడారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ కోసం అమృతరావు ఆమరణ నిరాహార దీక్ష చేపట్టి బుధవారానికి 60 ఏళ్లు పూర్తయిన సందర్భంగా వై.మస్తానప్ప చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అమృతరావు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా స్టీల్‌ప్లాంట్ కార్మిక సంఘ నాయకులు మాట్లాడుతూ విశాఖ ఉక్కు ఉద్యమాన్ని తారాస్థాయికి చేర్చడంలో అమృతరావు ప్రధాన భూమిక పోషించారని కొనియాడారు. ఆయన కృషి వల్ల వేలాది కుటుంబాలు ఉపాధి పొందుతున్నాయన్నారు. వైఎస్సార్‌టీయూసీ జోనల్ ఇన్‌చార్జి పి.వి.సురేష్ మాట్లాడుతూ అమృతరావు ప్రారంభించిన విశాఖ ఉక్కు ఉద్యమం తెలుగు ప్రజలందరినీ ఏకతాటిపైకి తెచ్చిందన్నారు. ట్రస్ట్ చైర్మన్ వై.వరలక్ష్మి మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ ఏర్పాటు కోసం 21 రోజులు అమరణ నిరాహారదీక్ష చేసి కేంద్ర ప్రభుత్వం నుంచి లిఖిత పూర్వక హామీ పొందిన ఘనత అమృతరావుకు దక్కుతుందన్నారు. కార్యక్రమంలో డి.ఆదినారాయణ, జె.అయోధ్యరామ్, వై.టి.దాస్, యు.రామస్వామి, మార్టుపూడి పరదేశి, పిట్టారెడ్డి, నమ్మి ప్రసాద్, చంద్రశేఖర్, రాయపాటి అనీల్, శశిభూషణ్ తదితరులు పాల్గొన్నారు.

సిమెంట్ ఫ్యాక్టరీకి అనుమతులు రద్దు చేయాలి



తహసీల్దార్ అమలకు వినతిపత్రం అందజేస్తున్న సభ్యులు

పెదగంట్యాడ : మండలంలో ఏర్పాటు చేయాలనుకున్న అంబుజా సిమెంట్ ఫ్యాక్టరీకి అనుమతులు రద్దు చేయాలని బాబు జగ్జీవన్‌రామ్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు కోరారు. ఈ మేరకు పెదగంట్యాడ తహసీల్దార్ అమలకు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడతూ ఇప్పటికే గంగవరం పోర్టు కాలుష్యంతోపాటు దుమ్ము ధూళితో ఉక్కిరిబిక్కిరి అవుతున్నామని వాపోయారు. అనారోగ్య సమస్యలతో సతమతవుతున్న మేమంతా డంపింగ్‌యార్డ్ దుర్వాసనతోపాటు ఆటోనగర్‌లోని హేమాద్రి కెమికల్ ఫ్యాక్టరీ నుంచి వచ్చే కాలుష్యంతో రోగాల బారిన పడి చస్తూ, బతుకుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి పరిస్థితుల్లో మరింత హాని కలిగించే అదానీ అంబుజా సిమెంట్ ఫ్యాక్టరీని (సిమెంట్ గ్రైండింగ్ యూనిట్) ఏర్పాటు చేయాలనుకోవడంతో అంతా భయాందోళన చెందుతున్నామన్నారు. సిమెంట్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేస్తే చిన్నారులు, వృద్ధుల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు. ప్రజారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని తక్షణమే ఫ్యాక్టరీ ఏర్పాటు నిర్ణయాన్ని విరమించి అనుమతులు రద్దు చేయాలని కోరారు. కార్యక్రమంలో మార్టుపూడి పరదేశి, గంట్యాడ గోవింద రాజు, దేవిపల్లి సంపూర్ణం, డాక్టర్ ఎస్.రాజారావు, ములకపల్లి వెంకటేష్, రాములు, పరదేశి తదితరులు పాల్గొన్నారు.

జనావాసాల మధ్య సిమెంట్ ఫ్యాక్టరీ వద్దు

జనావాసాల మధ్య అంబుజా సిమెంట్స్ గ్రౌండింగ్ యూనిట్‌ను ఏర్పాటు చేయొద్దని వైఎస్సార్‌టీయూసీ గౌరవ అధ్యక్షుడు గల్లా శంకర్‌సాయిరాం, అధ్యక్షుడు కె.దాలినాయుడు, ప్రధాన కార్యదర్శి డీవీ రమణ కోరారు. ఈ మేరకు తహసీల్దార్ పి.అమలకు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ నిర్మాణం కోసం తీసుకున్న భూమిని పీపీపీ విధానంలో భాగంగా మళ్లీ ఓ ప్రభుత్వ పరిశ్రమకు కేటాయించడం తప్పన్నారు. పరిశ్రమల నుంచి వెలువడే కాలుష్యాన్ని నియంత్రించేందుకు గ్రీన్ పార్క్ కోసం కేటాయించిన స్థలంలో పార్కు ఏర్పాటు చేయకుండా అంబుజా సిమెంట్స్‌కు కేటాయించడం సరికాదన్నారు. స్టీల్‌ప్లాంట్ కోసం సర్వం కోల్పోయిన నిర్వాసితులకు ఉపాధి అవకాశాలు లేక ఇబ్బంది పడుతున్నారన్నారు. ఇప్పటికే సిమెంట్ ఫ్యాక్టరీని వ్యతిరేకిస్తూ నిరసనలు తెలిపామన్నారు. దీనిపై ప్రభుత్వం స్పందించి సిమెంట్ ఫ్యాక్టరీ అనుమతులు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గోరంట్ల సూర్యనారాయణ, పేర్ల నూకరాజు, డివిటి రెడ్డి, సూరిబాబు, అప్పలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సుశీలా గజేంద్రరావు సేవలు ఎనలేనివి



సుశీలా గజేంద్రరావు దంపతులను సత్కరిస్తున్న అతిథులు

అగనంపూడి: గుదే సుశీలా గజేంద్రరావు ఆపదలో ఉన్న వారికి ఆసరాగా నిలుస్తున్నందుకు సంతోషంగా ఉందని వైఎస్సార్‌సీపీ 85వ వార్డు అధ్యక్షుడు, సద్భావనా సేవా సంఘం కార్యదర్శి గున్నంటి పూర్ణానందశర్మ (పూర్ణ) అన్నారు. కేంబ్రిడ్జ్ డిజిటల్ యూనివర్సిటీ నుంచి గౌరవ డాక్టరేట్ పొందిన సుశీలా గజేంద్రరావు దంపతులను సద్భావనా సేవా సంఘం ఆధ్వర్యంలో అగనంపూడిలోని 26 దేవాలయ కమిటీలు, స్వచ్ఛంద సంస్థలు, సేవా సంఘాలు, ప్రజా సంఘాలు ఘనంగా సత్కరించాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గజేంద్రరావు సేవలను గుర్తించిన విశ్వ విద్యాలయం గౌరవ డాక్టరేట్‌తో సత్కరించడం అగనంపూడికి దక్కిన గౌరవంగా భావిస్తున్నామన్నారు. సన్మాన గ్రహీత, లయన్స్ క్లబ్ జిల్లా చైర్‌పర్సన్, సర్వహిత చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు గుదే సుశీలా గజేంద్రరావు మాట్లాడుతూ అగనంపూడికి రుణపడి ఉంటానన్నారు. కార్యక్రమంలో పట్టా రామ అప్పారావు, విందుల వెంకటరమణ, బలిరెడ్డి సత్యనారాయణ, బి.కె. రామకోటి అన్నయ్య, సక్కా రమణబాబు, జి.బోసుబాబు, కొలిపాక అప్పారావు, యలమంచిలి చిన అప్పారావు, బలిరెడ్డి శ్రీను, కిడిమి హనుమంతరావు మరిశా రామచంద్రరావు, చిత్తా రామారావు, మామిడి శ్రీను, సాయిన సన్యాసిరావు, దాముర్తోతు అప్పలరాజు, శీరంశెట్టి గోవిందరావు, కట్టా పైడిరాజు, ఎం.మస్తాన్‌రెడ్డి, ఎల్వీ రమణ, బొండా ఈశ్వరరావు, గళ్ల అప్పారావు, చంద్రమౌళి, బళ్ల పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.

బాణసంచా స్టాళ్లకు అనుమతులొద్దు



ఆదర్శ గ్రౌండ్‌లో స్థానికులతో కలిసి నిరసన తెలుపుతున్న కార్పొరేటర్ భూపతిరాజు సుజాత

గాజువాక : స్థానిక ఆదర్శ గ్రౌండ్‌లో బాణసంచా స్టాళ్ల ఏర్పాటుకు అనుమతులు ఇవ్వొద్దని 73వ వార్డు కార్పొరేటర్ భూపతిరాజు సుజాత కోరారు. ఈ మేరకు జీవీఎంసీ కమిషనర్, న్యూపోర్టు సీఐలకు బుధవారం వినతిపత్రం సమర్పించారు. ఆదర్శ గ్రౌండ్‌లో బాణసంచా స్టాళ్లకు అనుమతులు ఇవ్వబోమని ఉన్నతాధికారులు గత ఏడాది చెప్పారన్నారు. అయినప్పటికీ ఈ ఏడాది స్టాళ్లు ఏర్పాటు చేస్తున్నారన్నారు. వాటికి అనుమతులు ఉన్నాయా..?, లేవా..? అనే విషయంపై అధికారికంగా ప్రకటన వెలువడలేదన్నారు. ఇక్కడ బాణసంచా స్టాళ్లు ఏర్పాటు చేయడం వల్ల ఓపెన్ ఆడిటోరియం నిర్మాణ పనులకు ఆటంకం కలుగుతోందన్నారు. గ్రౌండ్‌లో నిత్యం వేలాది మంది వాకింగ్, వ్యాయామం కోసం వస్తారని, వారికి అసౌకర్యం కలుగుతుందన్నారు. అనుమతులు లేకుండా అక్రమంగా ఏర్పాటు చేస్తున్న స్టాళ్లను వెంటనే తొలగించాలని కోరారు. ఈ సందర్భంగా స్థానికులతో గ్రౌండ్‌లో ఆమె నిరసన తెలిపారు.

సీసీక్యూసీ-2025లో గంగవరం పోర్టుకు పతకాలు



పతకాలతో అదానీ గంగవరం పోర్టు యాజమాన్య ప్రతినిధులు

పెదగంట్యాడ: విశాఖపట్నం చాప్టర్‌లోని క్వాలిటీ సర్కిల్ ఆఫ్ ఫోరం ఆఫ్ ఇండియా (క్యూసీఎఫ్ఐ) నిర్వహించిన 25వ చాప్టర్ కన్వెన్షన్ ఆన్ క్వాలిటీ కాన్సెప్ట్స్-2025 (సీసీక్యూసీ-2025)లో అదానీ గంగవరం పోర్టుకు బంగారు, వెండి పతకం లభించింది. ఆటోమేషన్‌లో ఈఎస్‌డీ-ఎంబీయూ బృందానికి బంగారు పతకం దక్కింది. కార్యాలయ భద్రత, వాతావరణ ప్రమాణాలపై ఈఎస్‌డీ యార్డ్ బృందానికి వెండి పతకం లభించింది. ఈ సందర్భంగా అదానీ గంగవరం పోర్టు యాజమాన్య ప్రతినిధులు మాట్లాడుతూ సీసీక్యూసీ-2025లో తమ సిబ్బంది సాధించిన విజయంపై సంతోషం వ్యక్తం చేశారు.


విశాఖ విమల విద్యాలయాన్ని తెరిపించాలి



తెలుగుతల్లి విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

ఉక్కునగరం : ఉక్కునగరంలోని విశాఖ విమల విద్యాలయాన్ని తెరిపించాలని డిమాండ్ చేస్తూ ఉపాధ్యాయులు బుధవారం నిరసన తెలిపారు. కణితి జంక్షన్‌లోని తెలుగు తల్లి విగ్రహం వద్ద ప్లకార్డులు, బ్యానర్లు పట్టుకుని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ తమకు మార్చి నెల నుంచి జీతాలు చెల్లించకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాయని వాపోయారు. ఉక్కు యాజమాన్యం పాఠశాలను తెరిపించాలని, లేనిపక్షంలో రాష్ట్ర ప్రభుత్వానికి నడపమని లేఖ రాయాలని డిమాండ్ చేశారు. ఇన్నాళ్లు సర్వీసు చేసిన తమకు ఉద్యోగం లేకుండా చేయడం దుర్మార్గమన్నారు. తమకు న్యాయం చేయాలంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో స్టాఫ్ సెక్రటరీ బి.సత్యనారాయణ, జాయింట్ సెక్రటరీ అనిత, సత్యం, మధుసూదన్, శ్రీనివాస్, నాగవల్లి, జ్యోతి, మణి, రెజీనా, సుధ, శోభ, జయ, శేషమణి, మేరీ సుగుణ, సుశీల, వెంకటరావు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సూపర్ జీఎస్టీతో ఆతిథ్య రంగానికి ఊతం



మాట్లాడుతున్న జీఎస్టీ డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసరావు

గాజువాక : సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్ పేరిట జీఎస్టీ ప్రయోజనాలను ఇంటింటికీ తీసుకెళ్లేలా ప్రభుత్వం కార్యాచరణ చేపట్టిందని జీఎస్టీ డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్ ఆర్.శ్రీనివాసరావు తెలిపారు. విశాఖ హోటల్ మర్చంట్స్ అసోసియేషన్ గాజువాక జోన్ ఆధ్వర్యంలో గాజువాకలో బుధవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ఆతిథ్య రంగం అభివృద్ధికి సూపర్ జీఎస్టీ విధానం ఎంతగానో తోడ్పడుతుందని చెప్పారు. జీఎస్టీ తగ్గింపు వల్ల పర్యాటకరంగం అభివృద్ధి చెంది తద్వారా హోటళ్లకు మరింత ఆదరణ పెరుగుతుందన్నారు. సామాన్యులకు మెరుగైన ఫలాలు అందించాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందన్నారు. దీనిపై ప్రజల్లో విస్తృత ప్రచారం చేసేందుకు ఈ చర్యలు చేపట్టామన్నారు. కార్యక్రమంలో జీఎస్టీ అధికారులు ఎం.శేషు కుమారి, శైలజ, అసోసియేషన్ జోన్ కన్వీనర్ వి.కె.రాజు, సభ్యులు నాయుడు, హరీష్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

బాణసంచా నిల్వలపై మెరుపుదాడులు

- మందుగుండు సామగ్రి స్వాధీనం
- ఇద్దర్ని అదుపులోకి తీసుకున్న పోలీసులు



గాజువాకలో నిల్వ ఉంచిన బాణసంచా

గాజువాక: సిటీ టాస్క్‌ఫోర్స్ సిబ్బంది గాజువాక ప్రాంతంలోని బాణసంచా తయారీ, మందుగుండు నిల్వల కేంద్రాలపై బుధవారం మెరుపుదాడి చేశారు. గాజువాక, పెదగంట్యాడ ప్రాంతాల్లో ఎటువంటి అనుమతులు లేకుండా బాణసంచా నిల్వలు కలిగి ఉన్నవారిని ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. సంబంధిత మందుగుండు సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న సరుకును, ముద్దాయిలను సంబంధిత పోలీస్ స్టేషన్లకు అప్పగించారు. పర్మిషన్లు, లైసెన్సులు లేకుండా నిల్వ చేసిన వ్యక్తులపై కేసులు నమోదు చేశారు. గాజువాక పోలీస్ స్టేషన్ పరిధిలోని హైస్కూల్ రోడ్ ఏరియాలో నివాసముంటున్న బొద్దు గాంధీ వద్ద రూ.లక్ష విలువైన మందుగుండు సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. న్యూపోర్టు పోలీస్ స్టేషన్ పరిధిలోని కొత్త దిబ్బపాలెం నిర్వాసిత కాలనీకి చెందిన వడ్ర అప్పలరాజు వద్ద రూ.40 వేలు విలువైన సరుకును స్వాధీనం చేసుకున్నట్టు పోలీసులు తెలిపారు. నగరవాసులు తమ పరిసర ప్రాంతాల్లో అనధికారికంగా బాణసంచా నిల్వ చేస్తున్నారని అనుమానం ఉంటే డయల్ 100 /112 గానీ, పోలీస్ కమిషనర్‌కు 7995095799 నంబర్‌కు గానీ సమాచారం ఇవ్వాలని గాజువాక సీఐ పార్థసారథి తెలిపారు.

యువతకు ఆదర్శం అబ్దుల్ కలాం



కలామ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎంఈవో రమణాజీ తదితరులు

పెదగంట్యాడ : మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం యవతకు ఆదర్శనీయులని మండల విద్యాశాఖాధికారి కంకటాల రమణాజీ పేర్కొన్నారు. అబ్దుల్ కలాం జయంతిని పురస్కరించుకుని జీవీఎంసీ 77వ వార్డు పరిధి చేపలపాలెం ఎంపీపీ పాఠశాలలో హెచ్‌ఎం కూరపాటి వినోద్‌కుమార్ ఆధ్వర్యంలో బుధవారం కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ దేశ నిర్మాణంలో కలాం చేసిన కృషి మరువలేనిదన్నారు. పాఠశాల సిబ్బంది హేమంత్‌కుమార్, అనితదేవి పాల్గొన్నారు.